క్లుప్తంగా

వరినాట్ల పద్ధతులపై అవగాహన



బొందలదిన్నెలో వరినాట్లపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

సంజామల: వరిసాగులో మేలైన పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి, లాభం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బొందలదిన్నె గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతుకు వరి నాట్లు వేసే పద్ధతులపై అవగాహన కల్పించారు. వరి నాట్లు వేసే సమయంలో నార శుద్ధి చేయాలన్నారు. వరి నాట్లు చదరపు మీటరుకు 32 వరి కుదర్లను నాటాలన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ జిలాని, సురేంద్ర, హరి, మానస, దివ్య, అబ్దుల్ పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

కోవెలకుంట్ల: స్వచ్ఛభారత్ పథకం కింద పనిచేస్తున్న కార్మికుల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలో స్వచ్ఛభారత్ కార్మికుల మండల కమిటీ జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు నెలల నుంచి కార్మికులకు వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్త చేశారు. పెరిగిన వేతన జీఓను అమలు చేసి నెలకు రూ. 10 వేల చొప్పున అందించాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా త్యాగరాజు, కార్యదర్శిగా గంగన్న, కోశాధికారిగా తిరుపాలు, సభ్యులుగా అచ్చమ్మ, మరియమ్మ, జయన్న, భాస్కర్, గోపాల్‌ను ఎన్నుకున్నారు.

మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో బెల్ట్‌షాపు ద్వారా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు. గ్రామానికి చెందిన నరసింహుడు అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

బేతంచెర్ల: పట్టణానికి చెందిన 7వ తరగతి విద్యార్థి సుబేక్ష సంజన లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కైవసం చేసుకుంది. ఈనెల 27న మహారాష్ట్రలోని పూనేలో జాతీయ యువజన సాంస్కృతిక ఉత్సవంలో దేశం నలుమూలల నుంచి 400 మంది యువకులను సమీకరించి విభిన్న సంస్కృతులు, భాషలను ప్రదర్శించారు. ఆమె ప్రతిభను గుర్తించి లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, డాక్టర్ కేవీ భార్గవ్, బేతంచెర్ల పట్టణ ఆర్యవైశ్యులు సంజనను అభినందించారు.

ఆయుర్వేద వైద్యుడు మృతి



దస్తగిరి(ఫైల్)

కోవెలకుంట్ల: మండల కేంద్రానికి చెందిన ఆయుర్వేద వైద్యుడు దస్తగిరి(82) శుక్రవారం మృతి చెందారు. నాలుగు నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక మృత్యువాతపడ్డారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గోడౌన్‌లో పోలీసుల తనిఖీలు

ప్యాపిలి: స్థానిక వెంగళాంపల్లి రోడ్డు పక్కన ఉన్న ఓ గోడౌన్‌లో గురువారం అర్ధరాత్రి సీఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రాయలచెరువుకు చెందిన విక్రమ్ అనే వ్యక్తి కొద్ది కాలంగా ఇక్కడ గోడౌన్ నిర్వహిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి ఆటోలో సరుకు లోడ్ చేస్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు గోడౌన్‌లో తనిఖీలు చేశారు. గోడౌన్‌లో బయో మందులతో పాటు ట్రయకోటనల్ అనే మందు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. సరుకుతో పాటు ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించి గోడౌన్‌ను సీజ్ చేశారు. అయితే బయో మందుల తయారీకి అనుమతులు ఉన్నాయా..లేదా అనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి గురైన బైక్ స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితుడు, పక్కనే బైక్

ప్యాపిలి: జలదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిగురుమాను మిట్ట వద్ద చోరీకి గురైన బైక్ శుక్రవారం దొరికింది. నిందితుడు రాశిపోగుల ఉమామహేశ్వరను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఊటకొండ గ్రామానికి చెందిన బండి నాగరాజు తన ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు ఈ నెల 17న జలదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వెంకటాంపల్లి గ్రామానికి చెందిన రాశిపోగుల ఉమా మహేశ్వర దొంగిలించినట్లు గుర్తించిన పోలీసులు శుక్రవారం నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన





కోవెలకుంట్ల డిపో గేటు ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, బనగానపల్లె ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్‌ఎంయూ కార్మికులు

కోవెలకుంట్ల: ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నంద్యాల జిల్లా కార్యదర్శి శివరాం కోరారు. ఏపీపీటీడీ(ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్) కడప జోన్ యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక డిపో గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల వేతనంలో కలపకుండా నిలిపివేసిన నైట్‌అవుట్ అలవెన్స్‌లను ప్రభుత్వ జీఓ 114 ప్రకారం యథావిధిగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల అరియర్స్, రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. బకాయిల చెల్లింపునకు ట్రెజరీ సిబ్బంది నగదు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగులపై ట్రెజరీశాఖ ఉన్నతాధికారులు మొండి వైఖరి అవలంభిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంఘం నాయకులు నరసింహులు, రాముడు, కేవీ సుబ్బయ్య, కాశన్న, గుర్రప్ప, ఎంఆర్‌కేరెడ్డి పాల్గొన్నారు.

జీఓ 114ను అమలు చేయాలి

బనగానపల్లె రూరల్: ఫైనాన్స్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఏపీ పీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన జీఓ 114లోని అలవెన్స్‌లను వెంటనే అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ బనగానపల్లె డిపో సెక్రటరీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డీపో గ్యారెజ్ ఎదుట టీ విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీలోని డ్రైవర్లు, కండెక్టర్లకు నైట్‌అవుట్ అలవెన్స్‌లు ట్రెజరీ అధికారులు కలపకుండా ఏకపక్షంగా నిలుపుదల చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్, మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలని, అర్హులైన వారికి ఏఏఎస్ ఇవ్వాలని, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యూటీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరింటకుంటే ఉద్యామాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు షేక్షావలి, గఫార్, జమ్ములయ్య, ఓబులేసు వెంకటేశ్వర్లు, ఏ.బాబు, కె.బాబు, రఫీ తదితరుల పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంత సభ్యులు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కొలిమిగుండ్ల: బందార్లపల్లెలో త్రైత సిద్ధాంత, ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణుడి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా స్వామివారి విగ్రహాన్ని కొలువుదీర్చి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు స్వామి ఉత్సవ విగ్రహాన్ని పూలతో అందంగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన త్రైత సిద్ధాంత సభ్యుల స్వామిని దర్శించుకున్నారు. మేళతాళాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు.

ప్యాపిలి: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం ప్యాపిలిలో శ్రీకృష్ణుని ప్రతిమకు గ్రామోత్సవం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రజలు శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ ప్రధాన వీధుల మీదుగా నిర్వహించిన గ్రామోత్సవానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, తహసీల్దార్ భారతి, డిప్యూటీ తహసీల్దార్ మారుతి, ఆర్‌ఐ సుధాకర్ రెడ్డి, నిర్వాహకులు కేశవులు, వెంకటరమణ, సురేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

15 వరకు ఈ- పంట నమోదుకు అవకాశం



ఈ- పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగైన పంటల వివరాలను నమోదు చేసుకునేందుకు సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉందని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. మండలంలోని ఆయా రైతు సేవా కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఈ పంట నమోదును శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 8,100 ఎకరాల్లో వివిధ పంటల సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు 5,200 ఎకరాల్లో పంటలు సాగయ్యాయన్నారు. 4,600 ఎకరాలకు సంబంధించి ఈ- పంట వివరాలు నమోదయ్యాయన్నారు. ఇప్పటి వరకు ఈ- పంట నమోదు చేసుకోని రైతులు ఆయా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలని తెలిపారు. వ్యవసాయ సంక్షేమ పథకాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం సంభవిస్తే ఈ- పంట నమోదు ఆధారంగానే నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం



పూజలు చేస్తున్న వేదపండితులు

కొలిమిగుండ్ల: స్థానిక నాయీబ్రాహ్మణ కాలనీలో దాతల సహకారంతో నిర్మించిన త్యాగరాజస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. వేదపండితుడు ఆలూరి రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఐదు గురు బుత్వికులు విశేష పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా కలశ స్థాపన, త్యాగరాజస్వామి, కోదండరామస్వామి, సీతా,లక్ష్మణ స్వామి విగ్రహాలతో పాటు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ట చేశారు. విగ్రహాల ప్రతిష్ట అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయీ బ్రాహ్మణ కుటుంబాలు, భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

కంటి జబ్బులపై అవగాహన అవసరం



విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ బిచ్చయ్య

బనగానపల్లె రూరల్: విద్యార్థులు కంటి జబ్బులపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని కంటి వైద్యనిపుణుడు డాక్టర్ బిచ్చయ్య అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ నేత్రదాన వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. కార్నియాకు గాయం, అంటు వ్యాధులు సంభవించినప్పుడు ఇన్ఫెక్షన్ వల్ల నల్లగుడ్డు (కార్నియా) పాడై దృష్టి లోపం వస్తుందన్నారు. మరణించిన వ్యక్తి నేత్రదానం వల్ల రెండుజీవితాల్లో వెలుగులు నింపిన వారవుతారన్నారు. నేత్రదానంపై తల్లిదండ్రులకు, ప్రజలకు విద్యార్థులు తెలియజేసి వారిని నేత్రదానం చేసేలా చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలగంగధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, షేహనాజ్ బేగం, సరోజమ్మ, శ్రీగౌరి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో వెళ్తున్న మహిళలు

గోధుమారి ఎల్లమ్మకు బోనాలు

బేతంచెర్ల: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా మండల పరిధిలోని హుసేనాపురం గ్రామ దేవత గోధుమారి ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు సామూహకంగా బోనాలతో డప్పులు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రమణీయం.. మద్దిలేటిస్వామి తిరుచ్చి ఉత్సవం



తిరుచ్చిపై విహరిస్తున్న స్వామివారు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఉదయం స్వామివారికి అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామివారిని ఆశీనులు చేసి మంగళవాయిద్యాల నడుమ ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ ఈఓ రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యూనిఫైడ్ పెన్షన్ స్కీంతో ఉద్యోగులకు అన్యాయం

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌తో ఉద్యోగులను మరోసారి మోసం చేస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సుబ్బరాయుడు, నరసింహారెడ్డి అన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం డోన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ నాయకులు లక్ష్మీదేవి, సంజీవరాయుడు, బాల రంగారెడ్డి, కృష్ణానాయక్, గోపాల్, సర్వజ్ఞమూర్తి, లతీఫ్, సీఐటీయూ నాయకులు శివరామ్, శ్రీకాంత్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ

బనగానపల్లె రూరల్: సామాజిక పింఛన్లను శనివారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు శుక్రవారం తెలిపారు. మండలంలో వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులు 12,511 మంది ఉన్నట్లు చెప్పారు. వీరికి పింఛన్ల పంపిణీకి రూ.5.36 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామంలో జరిగే పింఛన్ల పంపిణీలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

పాత వేళల్లోనే బస్సు నడపాలి

బేతంచెర్ల: కర్నూలు నుంచి మద్దిలేటి స్వామి ఆలయానికి పాత వేళల్లోనే బస్సులు నడపాలని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో ప్రతి రోజు ఉదయం కర్నూలుకు బస్సు ఉండేదని, ప్రస్తుతం మధ్యాహ్నానికి మార్చడం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి పాత విధానంలో వెళ్లేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు వెంకటాపురం చెరువుకు జలహారతి

డోన్ టౌన్: వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వెంకటాపురం తుమ్మల చెరువు (పల్లె చెరువు)కు శనివారం గంగా హారతి ఇస్తున్నట్లు ఆ సంఘం ఉపాధ్యక్షుడు కళ్లె శేషావలి శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాతల క్షేమాన్ని కోరుతూ శ్రావణ మాసం చివరి శనివారం పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం

కోవెలకుంట్ల: ఎస్సీ వర్గీకరణతో మాల సామాజికవర్గానికి అన్యాయం జరుగుతుందని అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మహేష్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ జరిగితే మాలలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో వెనుకబడి పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్నారని, వర్గీకరణకు అనుకూలమా, వ్యతిరేకమా అనే విషయాన్ని స్పష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు.

4న మండల మీట్

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సెప్టెంబర్ 4వ తేదీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన జరిగే సమావేశంలో విద్య, వైద్యం, విద్యుత్‌శాఖ, గ్రామీణ నీటిసరఫరా, గ్రామీణ గృహ నిర్మాణశాఖ, రెవెన్యూ, వెలుగు, పంచాయతీరాజ్, తదితర శాఖల పనితీరుపై చర్చ జరుగుతుందన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల మండల అధికారులు తప్పక హాజరుకావాలని సూచించారు.

రేపు వైద్య శిబిరం

బేతంచెర్ల: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంపీయూపీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధు సుధాకర్ రెడ్డి, రాజు తెలిపారు. స్వర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో గుండె వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శికి గాయాలు

అవుకు: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నవరం గ్రామ పంచాయతీ కార్యదర్శికి గాయాలయ్యాయి. వివరాలు.. సెప్టెంబర్ 1వ తేదీ పింఛన్ పంపిణీ కార్యక్రమానికి నగదు తీసుకెళ్లడానికి అన్నవరం పంచాయతీ కార్యదర్శి రాజేష్ బైక్‌పై అవుకు బయల్దేరాడు. మార్గమధ్యలో జమ్ములమ్మ గుడి వద్ద వాహనాల లైటింగ్ కారణంగా సరిగ్గా కనిపించక ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను 108లో బనగానపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తరలించారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం



చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్: మున్సిపల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం సాదాసీదాగా ముగిసింది. చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ డాక్టర్ జయరాం ప్రవేశపెట్టిన 42 అంశాలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. వైఎస్‌ఆర్ నగర్‌తో పాటు తారకరామనగర్ తదితర ప్రాంతాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టేందుకు సభ ఆమోదం తెలిపిందని చైర్మన్ రాజేష్ తెలిపారు. పట్టణంలోని పెద్ద డ్రైనేజీల్లో పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టినట్లు పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, డీఈ రసూల్, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వేడుకగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



పల్లకీపై విహరిస్తున్న అమ్మవారు

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి పల్లకీ సేవను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని సుందరంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు చేసి మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూరహారతులు ఇచ్చి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న కమిషనర్, కౌన్సిలర్లు

బేతంచెర్ల: మొక్కలు, ప్రకృతితో మానవ మనుగడ ఆధారపడి ఉందని.. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు అన్నారు. శుక్రవారం పట్టణ సమీపంలోని కొలుములపల్లె రహదారిలో వనం- మనం కార్యక్రమంలో భాగంగా కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, ఇబ్రహీం, కోట్ల మధు, బుగ్గన సుశీలమ్మ పాల్గొన్నారు.


సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్ రమేష్‌బాబు

బేతంచెర్ల: నగర పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ రమేష్ బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన వార్డు కౌన్సిల్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను చర్చించారు. అనుమతులు లేకుండా వేసిన లేఔట్లపై చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ ఇబ్రహీమ్ కోరారు. అక్రమ లేఔట్లలో స్థలాలు కొనుగోలు చేస్తే ఇంటి నిర్మాణానికి నగర పంచాయతీ అనుమతి ఇవ్వమని కమిషనర్ రమేష్ బాబు స్పష్టం చేశారు. అమృత్ 2.0 పథకం కింద ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటు చేసి నీరు సరఫరా చేస్తామని తెలిపారు. అందుకు రూ. 45 కోట్లు మంజూరు కాగా నగర పంచాయతీ, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 20 శాతం (రూ. 1.38 కోట్లు) ఏపీయూఎఫ్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ వారికి చెల్లించేందుకు తీర్మాణం చేశారు. అలాగే కోటపేట కూరగాయల మార్కెట్‌లో కూలిపోయిన ప్రహరీ నిర్మాణానికి రూ. లక్ష, వినాయక చవితి ఏర్పాట్లకు రూ.లక్ష, వినాయక ఘాట్ అభివృద్ధికి రూ. 10 లక్షలు, కొలుములపల్లె రస్తాలో నిర్మాణాలకు రూ. 12 లక్షలతో పనులకు తీర్మాణం చేశారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ పర్వీన్, కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, కోట్ల మధు, హుసేన్‌బీ, శకుంతల, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ లేకుంటే ఎంత చదువుకున్నా వృథా



అవగాహన సదస్సులో సీఐ

డోన్ రూరల్: క్రమశిక్షణ లేకుంటే ఎంత చదువుకున్నా ఉపయోగం లేదని టౌన్ సీఐ ఇంతియాజ్ అన్నారు. మండల పరిధిలోని ఉడుములపాడు మోడల్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు చిన్నతనం నుంచే పిల్లలకు క్రమశిక్షణ అలవాటు చేయాలని సూచించారు. రెండూ ఉంటేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని.. భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాతో సమయాన్ని వృథా చేయవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో డాక్టర్ దీపిక, ప్రిన్సిపాల్ జాస్మిన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐ రోడ్డు వెంట మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు నిర్మించుకునేవారితో పాటు ప్రతి ఒక్కరు ఇంటి వద్ద రెండు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అలాగే ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ జయరామ్, సీఐ ఇంతియాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
డోన్, బనగానపల్లె
90100 55532 (డోన్)
99122 20581 (బనగానపల్లె)
Office mail : sakshiknladvt@gmail.com